# 13th round of India-China Corps Commander Level Meeting

October 11, 2021

# భారత్-చైనా కోర్ కమాండర్ స్థాయి 13వ విడత సమావేశం

అక్టోబర్ 11, 2021

భారత్-చైనా కోర్ కమాండర్ స్థాయి 13వ విడత సమావేశం 2021 అక్టోబర్ 10న చుషుల్-మోల్డో సరిహద్దు కలిసే పాయింట్‌లో నిర్వహించబడింది. తూర్పు లడఖ్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ)కు సంబంధించి మిగిలిన సమస్యల పరిష్కారంపై ఇరు పక్షాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించాయి. యథాతథ స్థితిని మార్చడానికి, ద్వైపాక్షిక ఒప్పందాలకు విరుద్ధంగా చైనా ఏకపక్షంగా తీసుకుంటున్న చర్యలే ఎల్‌ఏసీ వెంబడి పరిస్థితికి కారణమని భారత పక్షం ఎత్తి చూపింది. ఈ నేపథ్యంలో పశ్చిమ సెక్టార్‌లోని ఎల్‌ఏసీ వెంబడి శాంతి, ప్రశాంతతలను పునరుద్ధరించేందుకు మిగతా ప్రాంతాల్లోనూ చైనా పక్షం తగు చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొంది. ఇటీవల దుషాన్‌బేలో జరిగిన సమావేశంలో ఇరు దేశాల విదేశాంగ మంత్రులు సూచించిన మార్గనిర్దేశానికి కూడా ఇది అనుగుణంగా ఉండగలదని వివరించింది. దుషాంబే సదస్సులో ఇరు పక్షాలు మిగతా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నాయి. మిగతా అంశాలను పరిష్కరించుకోవడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలు మరింత పురోగతికి ఆస్కారం లభించగలదని భారత పక్షం స్పష్టం చేసింది. సమావేశం సందర్భంగా మిగతా అంశాల పరిష్కారం కోసం భారత పక్షం నిర్మాణాత్మక సూచనలు చేసింది. కానీ చైనా పక్షం వాటిపై అంగీకారం తెలపలేదు అలాగే భవిష్యత్‌కు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు కూడా చేయలేదు. ఫలితంగా మిగతా అంశాలు పరిష్కారం కాకుండానే సమావేశం ముగిసింది.

సమాచారం ఇచ్చిపుచ్చుకోవడాన్ని కొనసాగించాలని, అలాగే క్షేత్ర స్థాయిలో స్థిరత్వాన్ని కొనసాగించాలని ఇరు పక్షాలు తీర్మానించాయి. ద్వైపాక్షిక సంబంధాలను చైనా పక్షం పూర్తి స్థాయిలో పరిగణనలోకి తీసుకోగలదని, ద్వైపాక్షిక ఒప్పందాలు మరియు ప్రోటోకాల్స్‌కి లోబడి మిగతా అంశాలను సత్వరం పరిష్కరించుకునే దిశగా కృషి చేయగలదని ఆశిస్తున్నాము.

**న్యూఢిల్లీ**

**అక్టోబర్ 11, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.